కమ్యూనిటీహాల్‌కు తాళం.. వరండాలో చదువులు

● ఉచితంగా చదువు చెబుతున్న సుశీలాదేవి మెమోరియల్ ట్రస్టు

● ఇందుకోసం కమ్యూనిటీహాల్ వినియోగం
● ప్రతాప్‌నగర్ కమిటీ అభ్యంతరం
● పోలీసులు కలగజేసుకోవడంతో మొదలైన తరగతులు

బంజారాహిల్స్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బడి బాట పేరిట చదువుకు దూరమైన వారిని పాఠశాలకు చేర్పేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో ఓ బస్తీలో కమ్యూనిటీ హాల్‌పై తలెత్తిన వివాదం వల్ల చిన్నారుల చదువులు రోడ్డున పడ్డాయి. పెత్తనం తమదే ఉండాలని బస్తీ కమిటీ నాయకులు తాళం వేయడంతో స్వచ్ఛంద సంస్థ సహకారంతో చదువుకుంటున్న చిన్నారులు వరండాకు పరిమితమయ్యారు. చివరకు పోలీసులు కలుగజేసుకోవడంతో కమిటీ దిగి వచ్చి తాళం తీయడంతో చదువులు కొనసాగాయి.

పంజాగుట్ట జర్నలిస్టుకాలనీలో నివాసముండే దివంగత జర్నలిస్టు వామనరావు 1982లో కాలనీకి ఆనుకొని ఉన్న ప్రతాప్‌నగర్ వాసుల కోసం పాఠశాలను తెరిచారు. సుశీలాదేవి మెమోరియల్ ట్రస్టు పేరిట ఎల్‌కేజీ నుంచి 4వ తరగతి వరకు ఉచితంగా పుస్తకాలు, బ్యాగ్‌లు ఇచ్చి పాఠాలు చెప్పేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రతాప్‌నగర్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో దీనిని ప్రారంభించారు. 2018లో ఆయన మరణించాక కూడా పాఠశాలకు అమెరికా నుంచి వామనరావు కుమార్తె నిధులు సమకూరుస్తూ నడిపిస్తున్నారు. ఇక్కడ చదివిన వారు మిగతా తరగతులు చదువుకునేలా ప్రభుత్వ అనుమతి కోరుతూ అర్జీ పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా కమ్యూనిటీహాల్‌పై బస్తీవాసులకే హక్కులు ఉండాలని ప్రతాప్‌నగర్ కమిటీ కొంతకాలంగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ వచ్చింది. పాఠశాలను వేరే చోటకు తరలించాలని కమిటీ కోరింది. ఈ మేరకు ట్రస్టుకు లేఖ రాశారు. కానీ, ట్రస్టు నిర్వాహకులు తామే ఖర్చులు పెట్టుకుంటూ ప్రతాప్‌నగర్ పిల్లలకు చదువు చెబుతుండగా కమిటీ కమ్యూనిటీ హాల్ కేటాయించలేరా అని బదులిచ్చింది.


ప్రతాప్‌నగర్‌లో కమ్యూనిటీహాల్‌కు తాళం వేయడంతో వరండాలో కూర్చున్న విద్యార్థులు


కమిటీ నాయకులను సముదాయిస్తున్న పోలీసులు

వేసవి సెలవులు ముగియడంతో..

ఈ వివాదం కొనసాగుతుండగా ఈనెల 12న వేసవి సెలవులు ముగియడంతో సుమారు 40 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాఠశాలకు వచ్చారు. కమ్యూనిటీహాల్‌కు తాళం కనిపించింది. కమిటీ వారు తాళం వేసినట్టు తేలింది. దీంతో అక్కడే వరండాలో చదువులు సాగాయి. ఈ వీడియోలు, కమిటీ తాళం వేసిన వైనం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శుక్రవారం ఉదయం కూడా తాళం తీయకపోవడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. వెంటనే తాళం తీయాలంటూ కమిటీని ఆదేశించారు. కానీ వారు ఒప్పుకోలేదు. పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యంతరాలు ఉంటే జీహెచ్‌ఎంసీ దృష్టికి తీసుకువెళ్లాలి గానీ, ప్రభుత్వ ఆస్తికి ప్రైవేట్ వ్యక్తులు ఎలా తాళం వేస్తారని ప్రశ్నించారు. తాళం తీయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కమ్యూనిటీహాల్ బస్తీవాసులకు ఉపయోగంలోకి రావాలంటే ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులను ఇతర ప్రాంతాలను తరలించాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో కమిటీ నాయకులు దిగి వచ్చి తాళం తీయడంతో చదువులు కొనసాగాయి.


మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న దళిత చైతన్య సంఘం అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్
● బేగంపేట, ఆంధ్రజ్యోతి


గౌరీశంకర్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న వెంకటేశ్వరనగర్ కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి
● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి


సనత్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాచారి తదితరులు
● బేగంపేట, ఆంధ్రజ్యోతి

అవయవదానంతో ముగ్గురి జీవితాల్లో వెలుగులు


శివపుత్రుడు

నిమ్స్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో బ్రెయిన్ డెడ్ అయింది. కర్నాటక గుల్బర్గా చింగోలికి చెందిన శివపుత్ర(43) చెంగాట పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో అతడి వాహనం స్కిడ్ అయ్యింది. కిందపడడంతో తలకు తీవ్రంగా గాయమైంది. కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో 12వ తేదీన బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. అవయవదానంపై జీవన్‌దాన్ ప్రతినిధులు శివపుత్ర భార్య కావేరికి అవగాహన కల్పించారు. అందుకు అంగీకరించడంతో శివపుత్ర శరీరం నుంచి రెండు కిడ్నీలు, లివర్ సేకరించి మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపినట్టు జీవన్‌దాన్ ప్రోగ్రాం నోడల్ అధికారి ప్రొఫెసర్ శ్రీభూషణ్ రాజు తెలిపారు.


ఫ్లడ్ లైట్ల ఏర్పాటు పనులకు భూమి పూజ చేస్తున్న సీఎన్ రెడ్డి

క్రీడాప్రాంగణంలో ఫ్లడ్ లైట్ల వెలుగులు

బోరబండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ క్రీడాప్రాంగణంలో రూ. 30 లక్షల వ్యయంతో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులకు రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడి నియామకం

బంజారాహిల్స్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడిగా ముద్దంగుల శ్రీనివాస్ రెండోసారి నియమితులయ్యారు. సాగర్‌సొసైటీలోని బీజేపీ కార్యలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నూతన కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఉదయ్‌కుమార్, గురుబ్రహ్మగౌడ్, వెలిశెట్టి రాంబాబు, పాండురంగారావు, ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్ గిరి, రాజకళ, కార్యదర్శులు బొట్టు కళ్యాణి, అంజిరాజు, లలిత, లక్ష్మీనారాయణ ముదిరాజ్, కోశాధికారిగా జె.సైదులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా విద్యాసాగర్‌రావు, రామ్మోహన్‌రావు, ఎం.శ్రీనివాస్, ఈ.రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేయనున్నట్టు చెప్పారు. తన నియామకానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

లక్ష్య సాధనకు పట్టుదల అవసరం

బేగంపేట, జూన్ 13 (ఆంధ్రజోతి): లక్ష్యం సాధించాలంటే విద్యార్థులకు పట్టుదల చాలా అవసరమని సినీ దర్శకులు, రచయిత రాధాకృష్ణ 'క్రిష్' జాగర్లమూడి అన్నారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థుల స్నాతకోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా సాధిస్తామనే ఆత్మవిశ్వాసం విద్యార్థుల్లో ఉండాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌పీఎస్ ప్రిన్సిపాల్ స్కంద్ బాలీ తదితరులు పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయండి


నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

కార్వాన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయాల్లో నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేసి, సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాసాబ్‌ట్యాంక్ సంక్షేమ భవన్ కార్యాలయాన్ని ముట్టడించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యాసంస్థలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల విద్యాసంస్థలు అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని నూతన భనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గురుకుల విద్యాసంస్థల్లో నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. లేకుంటే ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేశారు. సంక్షేమ భవన్ ముట్టడి చేసిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

పంజాగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ సూచించారు. శుక్రవారం పంజాగుట్టలోని ఏరో ఫాల్కన్స్ ఏవియేషన్ అకాడమీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విద్యార్థులకు 'రోడ్డు ప్రమాదాలు-నివారణ' అనే అంశంపై పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామ్ ప్రసాద్‌రావుతో కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకాడమీ ప్రతినిధి అభినయ్, బేగంపేట్ టీటీఐ సిబ్బంది అయాన్, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫార్మా సంస్థల ఉద్యోగులకు శిక్షణ

పంజాగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఫార్మా సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల్లో అంతర్జాతీయ ప్రమాణాలను పెంపొందించేందుకు భద్రతా ఆడిట్‌పై నేటి నుంచి 21 రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు ఆర్ గ్రో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ నఫీ అబ్బాస్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శిక్షణకు సంబంధించిన బ్రోచర్‌ను సెక్యూర్ ప్రోగ్రాం హెడ్ వనిత కట్టర్, జి.రాఘవతో కలిసి ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో అసోసియేట్ ట్రైనర్ కళ్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి

● ఎమ్మెల్యే తలసాని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. జూలై 1వ తేదీన అమ్మవారి కల్యాణం, 2న రథోత్సవం సందర్భంగా తలసాని ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణాన్ని భక్తులు వీక్షించేలా ఎల్‌ఈడీ స్క్రీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే క్యూ లైన్‌లలో తోపులాట జరగకుండా పటిష్టమైన బారీకేడ్‌లను ఏర్పాటు చేయాలని రోడ్డు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో మ్యాన్‌హోళ్లు, డ్రైనేజీ లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ కోసం మూడు షిఫ్టుల్లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబాగౌడ్, కార్పొరేటర్ సరళ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, ఆర్‌అండ్‌బీ ఈఈ రవీంద్ర మోహన్, వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభు, ఈవో కృష్ణ, ఎలక్ట్రికల్ ఏడీ కిశోర్, స్ట్రీట్ లైట్ డీఈ కిరణ్మయి, ఏఎంహెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, జోగిని శ్యామల, బీఆర్‌ఎస్ నాయకులు హన్మంతరావు, అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి కూతురు నర్సింహ, బోపిలాల్ చౌహాన్, పీయూష్ కుమార్‌గుప్తా, కట్టా బలరాం, ఉత్తమ్‌కుమార్, రాజ్ పురోహిత్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బేగంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డ, వికార్‌నగర్‌లో సుమారు రూ.76 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు కార్పొరేటర్ టి. మహేశ్వరితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వికార్‌నగర్‌లో మురుగునీటి సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులతో పాటు నాయకులు టి. శ్రీహరి, డి.వి.నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్, కిశోర్ కుమార్, పాటిగడ్డ గిరి పాల్గొన్నారు.

చింతలబస్తీ నాలా ఆక్రమణలపై హైడ్రా నజర్


బుల్కాపూర్ నాలా పనులను పర్యవేక్షిస్తున్న రంగనాథ్

ఖైరతాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బుల్కాపూర్ నాలాలో ఎలాంటి ఆక్రమణలున్నా తొలగించి నాలా నుంచి నీరు, చెత్త సులువుగా వెళ్లేలా చేయాలని అధికారులు, సిబ్బందిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులు, సిబ్బందితో కలిసి చింతలబస్తీ వద్ద బుల్కాపూర్ నాలాను సందర్శించి అందులో పూడికను త్వరగా తొలగించాలని కోరారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 పెన్షన్ కార్యాలయం చౌరస్తా సమీపంలో నాలా కల్వర్టు దగ్గర కబ్జాకు గురైన కట్టడాలను కూల్చివేయగా అక్కడ వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించాలని సూచించారు. కూల్చివేతలు జరిగిన ప్రాంతంలో కల్వర్టు కింది భాగం సగం మేరకు పూడుకుపోవడంతో ఎక్స్‌కవేటర్లను కిందకు దించి తొలగించాలని సూచించారు. పూడికతీత పనులతో పాటు నాలాను ఆక్రమించిన నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశించారు. చింతలబస్తీ, తుమ్మలబస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్‌సాగర్‌లోకి వరదనీరు సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కాగా, హైడ్రా కమిషనర్ మరోసారి వచ్చి ఆదేశాలు ఇవ్వడంతో నాలాను ఆక్రమించి కట్టుకున్న స్థానికుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. చింతలబస్తీ కారంపొడి గిర్నీ నుంచి తుమ్మలబస్తీ వైపు వెళ్లే నాలాలో కొన్ని ఆక్రమణలు ఉన్నట్లు హైడ్రా గుర్తించిందని, వాటిని తొలగించక తప్పదనే సంకేతాలు రావడంతో మరో రెండు, మూడు రోజుల్లో హైడ్రా యాక్షన్‌ప్లాన్ ఉండవచ్చునని భావిస్తున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి


కోట నీలిమతో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

బేగంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడిలో సుమారు 2500 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమకు శుక్రవారం వారు వినతిపత్రం ఇచ్చారు. అమీర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో ఆమెతో సమావేశమయ్యారు. ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో సుమారు ఎకరం స్థలాన్ని ఖబరస్థాన్ కోసం కేటాయించి పలు అభివృద్ధి పనులు చేశారన్నారు. బ్రాహ్మణవాడిలోని ఆర్.ఆర్.గోపాల్ కాంపౌండ్‌లో అక్రమ నిర్మాణాలు భారీగా జరుగుతున్నాయని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఇదే ప్రాంతంలోని లేన్ నెంబర్.8లో నాలా పక్కన ఉన్న సుమారు 2500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని, స్థలాన్ని కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని నాయకులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన నీలిమ ఆయా విభాగాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే భూమి కబ్జాను అడ్డుకోవాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాజేందర్, సలీంఖాన్, హనీఫ్‌ఖాన్, బబ్లూ పాల్గొన్నారు.

కురుమ సంఘం ఎన్నికలపై హైకోర్టును ఆశ్రయించాం


అభివాదం చేస్తున్న కురుమ సంఘం నాయకులు

పంజాగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఎన్నికలను సంఘం బైలాకు విరుద్ధంగా జనరల్ బాడీ సమావేశం నిర్వహించకుండా, అందరికీ సభ్యత్వ నమోదు పుస్తకాలు ఇవ్వకుండా నిర్వహించాలని ప్రస్తుత అధ్యక్షుడు చూస్తుండడంతో తాము రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించామని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోశిక శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుత అధ్యక్షుడు సంఘం బలోపేతానికి ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని, లేనిపక్షంలో అతడి అవినీతి, అక్రమాలపై తామే ఒక పత్రాన్ని విడుదల చేస్తామని తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం నాయకులు దేవర శ్రీనివాస్, దొడ్డి శ్రీనాథ్, వంశీ జెక్కుల, చిల్లంపల్లి సురేష్, రాకేష్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి సంఘం ఎన్నికలు జరగాల్సి ఉండగా ప్రస్తుత అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం సంఘం బైలాకు విరుద్ధంగా గడిచిన 20 సంవత్సరాలుగా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపకుండా తనకు అనుకూలమైన వారిని కార్యవర్గంలోకి తీసుకుంటూ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం కోకాపేటలో ఆత్మగౌరవ భవనం నిర్మాణం కోసం పదెకరాలు, రూ.10 కోట్లు ఇస్తే యెగ్గే మల్లేశం తన స్వార్థానికి, ఎమ్మెల్సీ పదవి కోసం ఐదెకరాలు, రూ. 5 కోట్లను యాదవ సంఘానికి అప్పగించారని ఆరోపించారు. దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ కురుమ భవనాన్ని కార్పొరేట్ పాఠశాలకు దొడ్డిదారిన అద్దెకు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ మన్సూరాబాద్‌లోని మూడెకరాల భూమిలో ఉన్న భవనాలను అద్దెకు ఇచ్చి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, లెక్కలు చూపడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా సంఘం మీడియా సెల్ కన్వీనర్‌గా దొడ్డి శ్రీనాథ్‌ను నియమించారు. సమావేశంలో సంఘం నాయకులు, ఎన్నికలలో పోటీ చేయనున్న అభ్యర్థులు బీర్ల శ్రీనివాస్, రాంగోపాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

సీఎం ప్రజావాణికి 185 దరఖాస్తులు

బేగంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి 185 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చెందినవి 35, రెవెన్యూ 45, ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్ 24, మున్సిపల్ 11, ఇతర శాఖలకు సంబంధించి 24 దరఖాస్తులు వచ్చాయి.

ముగ్గురు ఎస్‌ఐల బదిలీ

యూసుఫ్‌గూడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ నుంచి ముగ్గురు ఎస్‌ఐలు బదిలీపై వెళ్లారు. ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న అవినాష్‌బాబు బోయిన్‌పల్లి, సాయినాథ్‌రెడ్డి టాస్క్ ఫోర్స్, బాల్‌రాజ్ లేక్ వ్యూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఎస్‌బీ సిటీ వెస్ట్ జోన్ నుంచి కె.భానుచందర్‌గౌడ్, నార్త్ జోన్ నుంచి ఎస్.వెంకటయ్య బదిలీపై వచ్చారు. ముగ్గురు ఎస్‌ఐలు బదిలీ కాగా, ఇద్దరిని మాత్రమే కేటాయించారు.

'భూములు లాక్కున్నాడు.. న్యాయం చేయండి'

పంజాగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకుని పేదల భూములను ఆ నాయకుడు కబ్జా చేస్తున్నాడని బాధితులు ఆరోపించారు. తమ భూములు తమకు అప్పగించి న్యాయం చేయాలని బాధితులు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్, వెంపెల్లి గ్రామానికి చెందిన బాధితులు అబ్దుల్ జబ్బార్, ముప్పిడి భాస్కర్, పి.మల్లేష్ తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమకు వెంపల్లె గ్రామంలోని పలు సర్వే నెంబర్‌లలో ప్లాట్లు, భూమి ఉందని అన్నారు. తమ భూమి, స్థలంపై రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకునే స్థానిక నాయకుడు కబ్జా చేశాడని ఆరోపించారు. దొంగ పత్రాలు సృష్టించి వాటిని కబ్జా చేయడమే కాకుండా వివిధ విభాగాల అధికారుల సహాయంతో తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. అతడిపై పలుమార్లు ఫిర్యాదు చేశామని, పోలీసులు కేసు నమోదు చేసినా ఫలితం లేదని అన్నారు. గతంలో ఎంపీటీసీగానూ, సర్పంచ్‌గానూ పనిచేసిన ఆయన తన అధికారాన్ని ఉపయోగించి తమను ఇబ్బందులు పెడుతున్నాడని, తమ భూమిని, స్థలాలను కబ్జా చేసి తమపైనే దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఆ నాయకుడి అక్రమాలు, భూ కబ్జాలపై విచారణ జరిపించి చట్ట ప్రకారం శిక్షించాలని, తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

అంబేద్కర్ యూనివర్సిటీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు అవకాశం

బేగంపేట, జూన్ 13 (ఆంధజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 1987 నుంచి 2012 మధ్య యూజీ(డిగ్రీ) కోర్సులో చేరి పలు కారణాల వల్ల మధ్యలో ఆగిపోయిన విద్యార్థులు తిరిగి ఆ కోర్సులను పూర్తి చేసుకునే అవకాశాన్ని విశ్వ విద్యాలయ అధికారులు కల్పించారని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ రామాచారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జూబ్లీహిల్స్‌లోని యూనివర్సిటీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి రీ అడ్మిషన్ పొంది బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్‌లకు ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరుకావచ్చని తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా రీ అడ్మిషన్ పొందవచ్చని, రూ.500 ఆలస్య రుసుముతో ఈనెల 26 వరకు మరొక అవకాశం ఉంటుందని తెలిపారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

స్కేటింగ్ పార్కులో రూ. 48 లక్షలతో అభివృద్ధి పనులు

రాంగోపాల్‌పేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సర్దార్ పటేల్ రోడ్డులోని గురుస్వామి జీహెచ్ఎం స్విమ్మింగ్ పూల్ ఆవరణలో రూ. 48 లక్షలతో స్కేటింగ్ పార్కుకు షెడ్డు, ఎస్ఎస్ ఫ్లోరింగ్, పెయింటింగ్ తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ డీసీ డాకు నాయక్, ఈఈ సుబ్రహ్మణ్యం, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఎలక్ట్రికల్ ఏడీఈ శివ దుర్గా ప్రసాద్, మాజీ కార్పొరేటర్ ఎ. మల్లికార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చిలకలగూడలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

బౌద్ధనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో పలు ప్రాంతాల్లో శుక్రవారం కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పర్యటించారు. మేడిబావి జై భవానీ ఆలయం వద్ద, నామాలగుండు, చిలకలగూడ ప్రాంతాల్లో డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కరించాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుశాల్, జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, నాయకులు కరాటేరాజు, వెంకట్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

బౌద్ధనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ వారాసిగూడ బ్రాహ్మణ బస్తీలోగల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కె.సుజాత, ఉపాధ్యాయులు జి.శివరంజని, బి.ఉషారాణి ముందుగా విద్యార్థులతో సరస్వతిదేవీ చిత్రపటం వద్ద పూజలు చేయించారు. అనంతరం పలకలపై అక్షరాభ్యాసం చేయించారు.



బ్రాహ్మణ బస్తీలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జై భీమ్ మాల మహా సంఘం ప్రతినిధులు

ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలి

అడ్డగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లను వెంటనే జారీ చేయాలని జై భీమ్ మాల మహా సంఘం అధ్యక్షుడు ఆర్. మల్లేష్ కోరారు. శుక్రవారం సంఘం ప్రధాన కార్యదర్శి నక్కా మధు, రాఘవేందర్, మల్లేష్, ప్రసన్నలక్ష్మి, రమాదేవి తదితరులతో కలిసి మారేడ్‌పల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మల్లేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గానికి చెందిన వారు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే వెరిఫికేషన్ పేరుతో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.



విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న వినియోగదారులు

విద్యుత్ సమస్యలపై 20 ఫిర్యాదులు

బోయినపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ లలిత తెలిపారు. బోయినపల్లిలో శుక్రవారం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను డీఈ గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 20కి పైగా ఫిర్యాదులు అందాయన్నారు. రాజు కాలనీలో శిథిలావస్థలో ఉన్న స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, కొత్త సర్వీసు మీటర్లపై ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, మీటర్ల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని అధికారులు, సిబ్బందిని డీఈ గోపాలరావు, సీజీఆర్ఎఫ్ చైర్మన్ లలిత ఆదేశించారు.

తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



మడ్‌ఫోర్టు మహంకాళి ఆలయం వద్ద తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద శుక్రవారం శంకుస్థాపన చేశారు. బీజేపీ నాయకులు బి.ఎన్.శ్రీనివాస్, అరుణ్, మధు, హరికృష్ణ, నీరజ్, షణ్ముఖ్, వినోద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

ఉత్తమ పేరెంట్‌కు సన్మానం

తిరుమలగిరి జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బొల్లారం సదర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఉత్తమ పేరెంట్‌గా శ్రీనివాస్‌ను ఎంపిక చేసి సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత మాట్లాడుతూ ఈ ఏడాది శ్రీనివాస్ 15 మది పేద విద్యార్థులకు పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాంతేశ్వరి, నిర్మల, సుధ, సరళ తదితరులు పాల్గొన్నారు.

ఆ మలుపు యమ డేంజర్

- బొల్లారం ఫ్రీడం భవన్ వద్ద తరచూ ప్రమాదాలు
- స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం



బొల్లారంలో ఫ్రీడం భవన్ వద్ద మూల మలుపు

తిరుమలగిరి జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ బొల్లారం వరకు రహదారి సాఫీగానే ఉన్నా బొల్లారం కోటేశ్వర ఆలయం, చెక్‌పోస్ట్ ఫ్రీడం భవన్ మూలమలుపు వద్దకు రాగానే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయిన దాఖలాలు ఉన్నాయి. కోటేశ్వర ఆలయం ఎదుట, ఫ్రీడం భవన్ వద్ద ఉన్న మూలమలుపు రోడ్డు, అల్వాల్ రైతు బజార్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు లేవు. వాహనాలు వేగంగా వెళ్తుండడంతో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని నెలల క్రితం రైతు బజార్‌లో భార్యాభర్తలు కూరగాయలు కొనుగోలు చేసి వెళ్తుండగా ఓ భారీ వాహనం వారిని ఢీకొట్టింది. భర్త అక్కడికక్కడే చనిపోయాడు. మృతదేహాన్ని గ్రామానికి డీసీఎంలో తీసుకెళ్తుండగా ఫ్రీడం భవన్ వద్ద మూల మలుపు తిరుగుతుండగా డీసీఎం బోల్తా పడడంతో అందులో ఉన్న ఉన్నవారు తీవ్రంగా గాయపడ్డారు. కోటేశ్వర ఆలయం వద్ద కూడా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లు భవనాల శాఖ అధికారులు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



అల్వాల్ రైతుబజార్ నుంచి హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ప్రాంతాల మధ్య తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను అధికారులు గుర్తించి స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

- రాజారెడ్డి

కంటోన్మెంట్ పార్కు వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయాలి



కంటోన్మెంట్ పార్కులో వాకింగ్‌కి వెళ్లడానికి రోడ్డు దాటడానికి పలువురు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్‌తోపాటు ట్రాఫిక్ పోలీస్‌ను ఏర్పాటు చేయాలి. - ఉమేష్

మలేరియా, డెంగీ కేసుల గుర్తింపు

కంటోన్మెంట్ యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

సికింద్రాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఒకరికి మలేరియా, మరి కొందరికి డెంగీ వ్యాధి సోకినట్టు తేలడంతో హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం అప్రమత్తమయ్యాయి. రోగుల నివాసాలు, పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించడమే కాకుండా, చుట్టు పక్కల ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలని అధికారులు నిర్ణయించారు. రసూల్‌పురాలో ఓ వ్యక్తికి మలేరియా, పికెట్, తిరుమలగిరి తదితర ప్రాంతాల్లోని 10 మందికిపైగా డెంగీ వ్యాధి సోకినట్టు హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి వచ్చింది. డీఎంహెచ్ఓ కంటోన్మెంట్ యూనిట్ ఇన్‌చార్జి ఎం.యాదగిరి, హెల్త్ అసిస్టెంట్ వెంకటనారాయణ శుక్రవారం సికింద్రాబాద్ బోర్డు కార్యాలయాన్ని చేరుకున్నారు. కంటోన్మెంట్ శానిటేషన్ సూపరింటెండెంట్ దేవేందర్‌ను కలిసి సమాచారం అందించారు. కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు కంటోన్మెంట్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగునకు చర్యలు తీసుకుంటున్నామని దేవేందర్ వెల్లడించారు. బస్తీలు, మురికివాడల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలిన రోగుల నివాసాల చుట్టు పక్కల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పర్యటించారు. మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు.



తిరుమలగిరిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది

పాఠశాలలో మొక్కలు నాటిన బీజేపీ శ్రేణులు

నల్లగుట్ట ప్రభుత్వ పాథమిక పాఠశాల, మెక్లోడ్ గుడా పార్కులో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా సహ కోశాధికారి ఎస్సార్ మల్లేష్, డివిజన్ అధ్యక్షుడు భవర్‌లాల్ సందీప్ వర్మ, ఉపాధ్యక్షులు ఎల్లమెల్ల శ్రీనివాస్ యాదవ్, శివ కుమార్, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్ సూర్యవంశి, అనీష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి





పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మధుకర్ నాయక్, భానుక నర్మద తదితరులు

పికెట్ పార్కులో అభివృద్ధి పనుల పరిశీలన

మారేడుపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ పికెట్ పార్కులో కోటి రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్‌తో కలిసి పరిశీలించారు. దీనికి అటల్ బిహారీ వాజ్‌పేయి పార్కుగా నామకరణం చేశారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, గ్రీనరీ, యోగా మైదాన్, ఔషధ మొక్కలు, సుమారు వెయ్యి అశోక చెట్లు, వివిధరకాల పూలవనం వంటి పనులు చేపడుతున్నామని మధుకర్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు హెల్త్ సూపరింటెండెట్ దేవేందర్, శానిటేషన్ సూపరింటెండెట్ మహేందర్, ఇంజనీర్ దినేష్, నాయకులు టోపి శంకర్, విజయానంద్, నాగభూషణం రెడ్డి, రాజు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద దుర్ఘటన బాధాకరం

బోయినపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాద దుర్ఘటన బాధాకరమని బోయినపల్లి పీస్ కమిటీ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి బోయినపల్లి సర్కిల్ కార్యాలయ ఆవరణలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ జేపీ యువసేన సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. జంపన ప్రతాప్ మాట్లాడుతూ ఈ ఘటన దేశ ప్రజలను కలిచివేసిందన్నారు. కార్యక్రమంలో యాదగిరి, సురేష్, వీపీ రాజు, గణేష్ టెంపుల్ కమిటీ సభ్యులు ముఖేష్ యాదవ్, వరప్రసాద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్: విమాన ప్రమాద మృతుల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ బీజేపీ నాయకులు మేకల కీర్తి, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, హర్షకిరణ్, హనుమంత్ ముదిరాజ్, సత్యనారాయణ తదితరులు మధురానగర్ కాలనీలో మొక్కలు నాటారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు.



విమాన ప్రమాద మృతులకు సంతాపం తెలుపుతున్న జంపన ప్రతాప్, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు



పేద పిల్లల చదువుకు ఆర్థిక సహాయం

బౌద్ధనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పేద పిల్లల చదువు నిమిత్తం బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు పి. సాయిప్రసాద్‌గౌడ్ ఆర్థిక సహాయం అందజేశారు. బీజేపీ నాయకుడు ప్రమోద్ ఆదేశాల మేరకు అంబర్‌నగర్‌కు చెందిన స్వర్గీయ రఘుయాదవ్ పిల్లలకు కేశవ మెమోరియల్ స్కూల్‌లో చదువు నిమిత్తం సీతాబంగారు ఆభరణాల శ్యామ్ సహకారంతో స్కూల్ ఫీజుతోపాటు, రూ. 30 వేలు అందజేశారు.

◀ పిల్లలకు ఆర్థిక సహాయం అందజేసిన సాయిప్రసాద్‌గౌడ్



అడ్డగుట్ట లోహియానగర్‌లో శుక్రవారం అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను బడిలో చేర్పించాలని సీడీపీఓ స్వప్న పాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంధ్య, అంగన్‌వాడీ టీచర్ వి. భద్రమ్మ, ఝాన్సీ, బస్తీ మహిళలు పాల్గొన్నారు. శాస్త్రినగర్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రుద్రవీణ మహిళా సంఘం అధ్యక్షురాలు శోభ తదితరులు పాల్గొన్నారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

వ్యక్తిని భవనంపై నుంచి తోసిన నిందితుడి అరెస్ట్

తిరుమలగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని భవనంపై నుంచి కిందకు తోసిన నిందితుడిని తిరుమలగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రశాంత్‌రావు(27) నేరేడ్‌మెట్ సీతరాంనగర్‌లో నివసిస్తున్నాడు. మద్యం, చెడు వ్యసనాలకు బానిసైన అతడు ఈ నెల 6వ తేదీన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో ఉండే స్నేహితురాలు మోనిషా ఇంటికి వెళ్లాడు. అక్కడ న్యూసెన్స్ క్రియేట్ చేస్తుండగా.. వద్దని వారించిన ఆశ్లేను రెండో అంతస్తు నుంచి కిందకు తోసి పారిపోయాడు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం నేరేడ్‌మెట్‌లో ప్రశాంత్ రావును అదుపులోకి తీసుకున్నారు.

అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం.. నలుగురి అరెస్ట్

వ్యభిచార గృహంపై పోలీసులు దాడిచేశారు. నలుగురిని అరెస్ట్ చేశారు. ఆర్టీసీ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన హస్నన్ మోలోయ్, మిరాజుల్ మొండల్, రేష్మ(పేరు మార్చారు) వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసుల దాడి చేసి పశ్చిమబెంగాల్‌కు చెందిన ముగ్గురితోపాటు ఫ్లాట్ యజమాని రమేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.



సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి ప్రవల్లికను అభినందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రవల్లిక ఎంపిక

బౌద్ధనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండికి చెందిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి చేపూర్వ ప్రవల్లిక సాఫ్ట్‌బాల్ ఆసియాకప్ పోటీలకు ఎంపికయింది. శుక్రవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ ఆమెను అభినందించారు. చైనాలో నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రవల్లిక ఎంపిక కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో శేఖర్, మేడిశెట్టి బాలాజీ, నవీన్, మహాత్మ తదితరులు పాల్గొన్నారు.



కార్తికేయను సత్కరిస్తున్న సెయింట్ పీటర్స్ స్కూల్ యాజమాన్యం

పట్టుదలే ఎవరెస్ట్ శిఖరాలకు నడిపించింది

- విశ్వనాథ్ కార్తికేయ

బోయినపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం ఎవరెస్టు ఎక్కడంతోపాటు ఏడు సమ్మిట్ అడ్వెంచర్‌లను పూర్తి చేసిన విశ్వనాథ్ కార్తికేయ పడకంటి తమ పాఠశాల విద్యార్థి కావడం గర్వకారణమని సెయింట్ పీటర్స్ హైస్కూల్ సీతారాంపూర్ డైరెక్టర్ ఆల్ఫోన్స్ రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో కార్తికేయ, అతడి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అతడితో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. కార్తికేయ మాట్లాడుతూ పాఠశాలలో నేర్చుకున్న నైతిక విలువలు, క్రమశిక్షణ, పట్టుదల నన్ను ఎవరెస్ట్ శిఖరాలకు నడిపించాయని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధవీరుల గాథలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకం

రాంగోపాల్‌పేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యుద్ధవీరుల విజయ గాథలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని స్ప్రింగ్ డేల్స్ హైస్కూల్ డైరెక్టర్లు కొనియాడారు. శుక్రవారం సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని హైస్కూల్‌లో ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న వాయుసేనకు చెందిన సార్జెంట్ రవి ప్రకాష్, కార్పొరల్ చంద్రను సత్కరించారు. స్కూల్ డైరెక్టర్లు శరత్‌చంద్ర, బాలరాజు, పుదివద్దర్ రాజ్ మాట్లాడుతూ.. 15 సంవత్సరాలుగా వైమానిక దళంలో సేవలందిస్తున్న కార్పొరల్ చంద్ర, సార్జెంట్ రవి ప్రకాష్‌ను సత్కరించడం తమ అదృష్టమన్నారు.



రవిప్రకాష్, కె.చంద్రను సత్కరించిన పాఠశాల డైరెక్టర్లు

డబ్బు దొంగిలించిన మహిళకు దేహశుద్ధి

బౌద్ధనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డబ్బు దొంగిలించిన మహిళకు మరో మహిళ దేహశుద్ధి చేసింది. ఈ సంఘటన శుక్రవారం వారాసిగూడ చౌరస్తాలో జరిగింది. స్థానికంగా గల మహిళ బండిమీద ఇంటింటికి వెళ్లి పూలు విక్రయిస్తుంటుంది. గురువారం పూలు విక్రయిస్తుండగా వయస్సుపైబడిన మహిళ ఆమెను పది రూపాయలు అడగగా పూల అమ్ముకునే మహిళ లేవని చెప్పింది. పూలు అమ్మే బిజీలో ఆమె ఉండగా బండిమీద ఏడువేల రూపాయలున్న ప్లాస్టిక్ కవర్‌ను తీసుకొని ఉడాయించింది. డబ్బులు దొంగిలించిన మహిళ శుక్రవారం వారాసిగూడ చౌరస్తాలో కనిపించడంతో పూలు అమ్ముకునే మహిళ దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించింది. నిందితురాలి నుంచి డబ్బులున్న కవర్ స్వాధీనం చేసుకున్నారు. అందులో రూ. 5,300 మాత్రమే ఉన్నాయి.



డబ్బు దొంగిలించిన మహిళకు దేహశుద్ధి చేస్తున్న మరో మహిళ

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం

బౌద్ధనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ వ్యక్తి కనిపించకుండాపోయాడు. చిలకలగూడ ఎస్ఐ సబిత తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్రకు చెందిన నిషా జ్ఞాన్‌మేతేకు నామాలగుండుకు చెందిన ఓజీ మహేందర్‌సింగ్(45)కు 19 సంవత్సరాల క్రితం వివాహం అయింది. మహేందర్ చెడు వ్యసనాలకు అలవాటు పడడంతోపాటు భార్యను వేధిస్తుండడంతో నిషా 2023లో భర్తపై వరకట్న కేసు పెట్టింది. అప్పటి నుంచి ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. మహేందర్‌సింగ్ నామాలగుండులో తన అన్నయ్య జగ్జీత్‌సింగ్ వద్ద ఉంటున్నాడు. ఈ సంవత్సరం జనవరి 15వ తేదీన తన బావ జగ్జీత్‌సింగ్ వద్దకు నిషా వెళ్లింది. నీ భర్త ఇక్కడ ఉండటం లేదని ఆయన ఆమెకు చెప్పాడు. మహేందర్‌సింగ్ ఆచూకీ లభించకపోవడంతో ఆమె శుక్రవారం చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మహేందర్ సింగ్